



EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
05 నవంబర్ 2024
పేజీలు: 02





## రన్ మెషీన్ విరాట్ కోహ్లీ 36వ పుట్టినరోజు

ప్రపంచ క్రికెట్‌లో అతడొక రన్ మెషీన్.. రికార్డులు బద్ధలు కొట్టేందుకే పుట్టిన రారాజు.. ఎంతటి లక్ష్యాన్నైనా ఆడుతూపాడుతూ కరిగించే ఛేజ్ మాస్టర్.. అంతేనా ఈతరం క్రికెటర్లకు ఆరాధ్యుడు. అథ్లెట్‌ను తలపించే దేహధారుడ్యంతో ఎందరికో స్ఫూర్తిగా మారిన ఫిట్‌నెస్ ఫ్రీక్.. ఇన్ని విశేషణాలు ఉన్న ఆ ఆటగాడు ఇంకెవరు.. భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ. తన క్లాస్ ఇన్నింగ్స్‌లతో అభిమానుల గుండెల్లో చెలరేగని స్థానం సంపాదించిన విరాట్ పుట్టిన రోజు ఇవాళే. అండర్ -19 వరల్డ్ కప్ హీరోగా జట్టులోకి వచ్చి.. విలువైన ఆటగాడిగా.. సమర్థుడైన నాయకుడిగా జట్టుపై తన ముద్ర వేసిన కోహ్లీ 36వ వసంతంలో అడుగుపెట్టాడు. ఈ సందర్భంగా అభిమానగణం సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. క్రికెట్‌లో దిగ్గజ ఆటగాడిగా నిలిచిపోయే కోహ్లీ 1988 నవంబర్ 5వ తేదీన జన్మించాడు. కోహ్లీకి సోదరుడు వికాస్, సోదరి భావన ఉన్నారు.కోహ్లీ బాల్యమంతా ఉత్తమ్ నగర్‌లోనే గడిచిపోయింది. భారత లెజెండ్ సచిన్ టెండూల్కర్‌ను ఆరాధిస్తూ పెరిగిన కోహ్లీ.. పెద్దయ్యాక అతడి మాదిరిగానే క్రికెటర్ అవ్వాలని కలలు కన్నాడు. అనుకున్నట్టే తన ఫేవరెట్ ఆటగాడితో కలిసి దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. అంతేకాదు సచిన్ పేరిట ఉన్న పలు రికార్డులు బ్రేక్ చేసి తానొక చాంపియన్ ప్లేయర్ అని చాటుకున్నాడు.

### 27 వేల క్లబ్‌లో

ఇక కోహ్లీ బ్యాట్ విధ్వంసానికి చెల్లాచెదురైన రికార్డులు మచ్చుకు కొన్ని.. నిరుడు స్వదేశంలో జరిగిన వరల్డ్ కప్‌లో 50వ వన్డే శతకంతో ప్రకంపనలు రేపిన విరాట్ అంతర్జాతీయ క్రికెట్‌లో 27 వేల పరుగుల మైలురాయికి చేరుకున్నాడు. అత్యంత వేగంగా ఈ క్లబ్‌లో చేరిన ఆటగాడిగా కోహ్లీ చరిత్ర సృష్టించాడు. కోహ్లీ కంటే ముందు ముగ్గురు దిగ్గజాలు 27 వేల క్లబ్‌లో చేరారు. వీళ్లలో సచిన్ టెండూల్కర్ 34,357 రన్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. కుమార సంగక్కర 28,016 రన్స్, ఆస్ట్రేలియా మాజీ సారథి రికీ పాంటింగ్ 27,483 పరుగులతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నారు.



## 8న సీఎం రేవంత్ రెడ్డి మూసీ పునరుజ్జీవ పాదయాత్ర

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్రపై రాజకీయవర్గాల్లో ఆసక్తి నెలకొంది. వలిగొండ టూ బీబీనగర్.. 6 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేపట్టనున్నారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది తెలంగాణ ప్రభుత్వం. ఈ ప్రాజెక్ట్ మొదలుపెడుతున్నామని ప్రకటించగానే దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అయినా ప్రభుత్వం మాత్రం ముందుకే వెళ్తుంది. మూసీకి పునరుజ్జీవం పోసి నల్గొండ ప్రజల కష్టాలు తీర్చుతామని అంటోంది. ఈ క్రమంలో మూసీ వెంట ఉన్న ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు స్వయంగా పాదయాత్ర చేపట్టబోతున్నారు సీఎం రేవంత్ రెడ్డి. తన జన్మదినం సందర్భంగా నవంబర్ 8న కుటుంబ సమేతంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఆపై జిల్లా అధికారులతోనూ సమీక్ష చేపడుతారు. దర్శనం అనంతరం రోడ్డు మార్గాన వలిగొండ మండలం సంగెం గ్రామానికి చేరుకుంటారు సీఎం రేవంత్‌రెడ్డి. భువనగిరి నియోజకవర్గ పరిధిలో బొల్లేపల్లి, సంగెం, భీమలింగం వంతెన వరకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే మూసీ పునరుజ్జీవ ప్రజా చైతన్యయాత్రలో సీఎం పాల్గొంటారు. ఆ తరువాత మిషన్ భగీరథ పథకంలో భాగంగా మల్లన్న సాగర్ నుంచి యాదాద్రి జిల్లాకు మంచినీటి సరఫరా కోసం నిర్మించనున్న పైప్‌లైన్ ప్రాజెక్ట్ పైలాన్‌ను ఆవిష్కరిస్తారు.



## అమెరికా అధ్యక్ష ఎన్నికలు నేడే

అమెరికా మొదటి మహిళా అధ్యక్షురాలిగా కమలహారిస్ చరిత్ర సృష్టిస్తారా? మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికై శ్వేతసౌధంలో అడుగిడాలన్న డొనాల్డ్ ట్రంప్ ఆశలు ఫలిస్తాయా? కమల, ట్రంప్ భవితవ్యంపై మరికొద్ది గంటల్లో అమెరికా ఓటర్లు తీర్పు చెప్పనున్నారు. అగ్రరాజ్య చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఈసారి పోటీ నెలకొంది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలాహారిస్.. నువ్వా నేనా అన్నట్టుగా తలపడుతున్నారు. స్థానిక నిబంధనల ప్రకారం మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్యలో పోలింగ్ ప్రారంభమవుతుంది. రాత్రి 7 గంటల నుంచి 11 గంటల మధ్యలో పోలింగ్ ముగుస్తుంది. ఈ సమయాలు ఆయా కౌంటీలు, రాష్ట్రాలనుబట్టి వేర్వేరుగా ఉంటాయి. పోలింగ్ ముగిసిన వెంటనే ఫలితాల వెల్లడి ప్రారంభమవుతుంది. ఈ నెల 6 నుంచి డిసెంబరు 11 వరకు ఎన్నికల ఫలితాలను కౌంటీలు, రాష్ట్రాలు ధ్రువీకరిస్తాయి.

జనవరి 20న కొత్త అధ్యక్షుడి ప్రమాణం

2025 జనవరి 3న కొత్తగా ఎన్నికైన కంగ్రెషనల్ రిప్రజెంటేటివ్స్, సెనేటర్స్ ప్రమాణ స్వీకారం జరుగుతుంది. 2025 జనవరి 6న ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లను కాంగ్రెస్ లెక్కిస్తుంది. దీని కోసం కాంగ్రెస్ ప్రత్యేక సంయుక్త సమావేశం జరుగుతుంది. 270 లేదా అంతకన్నా ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని దేశాధ్యక్షునిగా ప్రకటిస్తారు. దేశ ఉపాధ్యక్షునికి కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. 2025 జనవరి 20న మధ్యాహ్నం దేశాధ్యక్షుడు ప్రమాణ స్వీకారం చేస్తారు.

డెమొక్రాట్VSరిపబ్లికన్: ఎవరిది ఆధిపత్యం?

అమెరికాలో చిన్నాచితకా పార్టీలు ఎన్ని ఉన్నా డెమొక్రటిక్(గుర్తు గాడిద), రిపబ్లికన్ల(సింబల్ ఏనుగు) మధ్యే ప్రధాన పోటీ ఉంటుంది. 1854 నుంచి ఇదే ఆనవాయితీ కొనసాగుతోంది. 1790లో ఏర్పడిన డెమొక్రటిక్ ప్రపంచంలోనే ఓల్డెస్ట్ పార్టీల్లో ఒకటి. ఆ పార్టీ తరఫున ఇప్పటి వరకు 16 మంది అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1854లో ప్రారంభమైన రిపబ్లికన్ పార్టీ నుంచి 19 మంది ప్రెసిడెంట్లుగా పనిచేశారు.

### అమెరికా ఎలక్షన్స్‌లో 'టై' అయితే?

538 ఎలక్టోరల్ కాలేజీ సీట్లలో ట్రంప్, కమలకు చెరో 269 సీట్లొస్తే ఎలా? అధ్యక్షుడిని ఎలా డిసైడ్ చేస్తారు? అలాంటి సందర్భమే వస్తే కాంగ్రెస్‌లోని దిగువ సభ(ప్రతినిధుల సభ) ప్రెసిడెంట్‌ని, ఎగువ సభ(సెనెట్) ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటాయి. అందుకే ఆ సభలకు జరుగుతున్న ఎన్నికలూ కీలకంగా మారాయి. అయితే ఆధునిక అమెరికా చరిత్రలో టై అయిన దాఖలాలు లేవు. చివరిసారి 1800లో టై కాగా థామస్ జెఫర్సన్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

అమెరికా ఎన్నికలు.. ఆసక్తికర విషయాలు

- ★ ప్రతిసారి నవంబర్ తొలి మంగళవారం ఎన్నికలు జరుగుతాయి
- ★ మొత్తం ఓటర్లు 24.4 కోట్లు
- ★ ఎర్లీ ఓటింగ్‌లో ఇప్పటికే ఓటు వేసినవారు 7.5 కోట్లు
- ★ ఇంగ్లిష్, చైనీస్, స్పానిష్, కొరియన్, బెంగాలీ భాషల్లో బ్యాలెట్ పేపర్



## ఏపీ టెట్‌లో మెరిసిన పేదింటి విద్యార్థులు

### 150కి 150 మార్కులు


విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన కొండ్రు అశ్విని టెట్ ఫలితాల్లో శతశాతం మార్కులు సాధించారు. పేపర్-1ఏ(ఎస్జీటీ)లో ఆమెకు 150 మార్కులకు 150 మార్కులు వచ్చాయి. 2014-16 మధ్య డైట్ పూర్తి చేసిన ఆమె వరుసగా ఐదు టెట్‌లకు పోటీపడ్డారు. తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, కె.శంకరరావు ప్రోత్సాహంతో డీఎస్సీ సాధించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. టెట్ ఫలితాల్లో పలువురు పేదింటి విద్యార్థులు సత్తా చాటారు. 150కి 150 మార్కులు సాధించి అదరగొట్టారు. విజయనగరానికి చెందిన కొండ్రు అశ్విని, నంద్యాల(D) గొర్విమానుపల్లె వాసి మంజుల, నిచ్చెనమెట్లకు చెందిన క్రాంతికుమార్ వంద శాతం మార్కులు సాధించారు. వీరి తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. టీచర్ ఉద్యోగం సాధించి పేద విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడమే లక్ష్యమని వారు వెల్లడించారు.

## భర్తనే మళ్లీ పెళ్లి చేసుకున్న సన్నీ లియోన్

మాజీ పోర్న్ స్టార్, బాలీవుడ్ నటి సన్నీ లియోన్ తన భర్త డేనియల్ వెబర్‌ను మళ్లీ పెళ్లి చేసుకున్నారు. వీరు 2011లోనే పెళ్లి చేసుకున్నారు. అయితే పెళ్లయి 13ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఇద్దరూ వధూవరుల్లా ముస్తాబై మాల్దీవ్స్‌లో తమ ముగ్గురు పిల్లల సమక్షంలో ఉంగరాలు మార్చుకున్నారు. వీరు ఓ పాపను దత్తత తీసుకొని, మరో ఇద్దరిని సరోగసి ద్వారా పొందారు. కాగా వీరి రీవెడ్డింగ్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.

## ఢిల్లీలో భారీగా వాయు కాలుష్యం..

### అత్యవసరమైతే బయటకు రావొద్దని సూచన



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతున్నది. రోజురోజుకు కాలుష్యం పెరుగుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యయునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది. దేశ రాజధాని నగరంలో మంగళవారం ఉదయం గాలి నాణ్యత సూచి 400పైగానే నమోదైంది. ప్రస్తుతం నగరంలో సెకండ్ ఫేజ్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ అమలులో ఉన్నది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం.. ఉదయం 8 గంటలకు ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 457, అలీపూర్‌లో 389, వజీర్‌పూర్ 437, జహంగీర్‌పురి 440, రోహిణి 397, పంజాబీ భాగ్‌లో 403 ఏక్యూఐ రికార్డయ్యింది. కాలుష్యం నేపథ్యంలో విజిబులిటీ సైతం తగ్గింది. పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్మేసింది. వివేక్ విహార్, ఆనంద్ విహార్, ఇండియా గేట్ తదితర ప్రాంతాల్లో 500 మీటర్ల వరకు దృశ్యమానత తగ్గింది. పెరుగుతున్న కాలుష్యంతో ప్రజల కళ్లల్లో మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో వైద్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అత్యవసరమైతే బయటకు రావొద్దని సూచించారు. ఇంట్లోనే ఉండి యోగా, ప్రాణాయామం చేయాలని సూచిస్తున్నారు.



## షమీని వదలనంటున్న బ్యాడ్ లక్!

ఇండియా సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పూర్తి స్థాయి క్రికెట్ ఆడేందుకు మరింత సమయం పట్టే అవకాశముంది. కీలకమైన ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌కు ముందు దేశవాళీ రంజీ టోర్నీ ద్వారా సన్నద్ధం కావాలనుకున్న షమీ ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. బుధవారం నుంచి చిన్నస్వామి స్టేడియం వేదికగా కర్ణాటకతో జరిగే మ్యాచ్‌తో పాటు మధ్యప్రదేశ్ పోరుకు ఎంపిక చేసిన బెంగాల్ జట్టులో షమీకి చోటు దక్కలేదు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టు సందర్భంగా నెట్స్‌లో ప్రాక్టీస్ చేసిన షమీ తాను 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉన్నానని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## మైసూరులో యువతిపై సామూహిక అత్యాచారం

మడికేరి నుంచి మైసూరుకు వచ్చి హోటల్‌లో ఉన్న సమయంలో తన స్నేహితులు ఇద్దరు తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఒక యువతి (23) విజయనగర ఠాణాలో సోమవా రం ఫిర్యాదు చేసింది. తనను బెదిరించి, ఒకరి అనంతరం మరొ కరు అత్యాచారం చేశారని ఆరోపించింది. ఆమె ఫిర్యాదు నేపథ్యం లో వేగంగా స్పందించిన పోలీసులు సోమవారం రాత్రి ఆ ఇద్దరినీ నగరంలో అరెస్టు చేసినట్లు సంబంధిత పోలీస్ అధికారి ధ్రువీకరించారు.



## నిజాంపేటలో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ప్రగతి నగర్ లోని ఆరవ డివిజన్ లో నవంబర్ 4వ తేదీన అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. అంబి చెరువుపై ఉన్న గాంధీ విగ్రహం యొక్క తల, మొండెం వేరు చేశారు. తెల్లవారుజామున ఈ సంఘటనను కాలనీవాసులు చూశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. గాంధీ విగ్రహం ధ్వంసం చేసిన వారు ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.ఇక, గాంధీ జయంతి రోజున విగ్రహాన్ని ఏర్పాటు చేసిన స్థానిక కాంగ్రెస్ నాయకులు.. చెరువుకట్టపై మందుబాబులు చేసిన ఘనకార్యం అని వాకర్స్ ఆరోపిస్తున్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న ప్రెస్టీజియస్ మూవీ 'తమ్ముడు'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నది. వచ్చే ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. నితిన్ న్యూ లుక్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. లయ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్, సంగీతం: అజనీష్ లోకనాథ్, నిర్మాణం: శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్.

## నితిన్ న్యూ లుక్ తమ్ముడు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ఇయాల్టి నుంచి హెల్మెట్ మస్ట్

రాజధానిలో గడిచిన మూడు రోజుల్లో హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతూ ముగ్గురు వాహనచోదకులు ప్రాణాలు కోల్పోయారని సిటీ ట్రాఫిక్ చీఫ్ పి.విశ్వప్రసాద్ పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మంగళవారం నుంచి నగర వ్యాప్తంగా హెల్మెట్, రాంగ్ సైడ్/రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. 215 మంది అశువులుబాశా రన్న ఆయన...వీరిలో 100 మంది ద్విచక్ర వాహన చోదకులే అని పేర్కొన్నారు. వీరిలో 46 మంది హెల్మెట్ ధరించని కారణంగానే చనిపోయారని, హెల్మెట్ ధరిస్తే క్షతగాత్రులుగా మారే ప్రమాదం 70 శాతం, మృత్యువాతపడే ముప్పు 40 శాతం తగ్గుతుందని విశ్వప్రసాద్ వివరించారు.

# తల్లి ఆస్తిని పొందే హక్కు కూతురు, అల్లుడికి లేదు

## హైకోర్టు కీలక నిర్ణయం

మన దేశంలో, ఆస్తి హక్కుల విషయంలో ప్రజలు తరచుగా గందరగోళాన్ని ఎదుర్కొంటారు. ఈ సందిగ్ధం కారణంగా ఇళ్లలో మళ్లీ గొడవలు తలెత్తుతున్నాయి. తండ్రి ఆస్తిలో పిల్లలకు ఉన్న హక్కుల గురించి దాదాపు అందరికీ తెలుసు, కానీ తల్లి ఆస్తిలో కుమార్తెకు ఎలాంటి హక్కులు ఉందో మీకు తెలుసా? సరియైనదా కాదా? మహిళలకు సంబంధించిన ఈ కేసులో కోర్టు తీర్పు వెలువడింది. మరి ఈ కీలక నిర్ణయం ఏంటో తెలుసుకుందాం. ఆస్తిలో హక్కులు లేదా దానికి సంబంధించిన నియమాలు మరియు చట్టాల గురించిన సమాచారం లేకపోవడం వల్ల, దేశంలో ప్రతిచోటా వివాదాస్పద పరిస్థితులు తలెత్తుతాయి, దాని ఫలితంగా మనం తరచుగా కోర్టు వార్తలలో ఈ విషయాలను చూస్తాము. ఇటీవలి కేసు ప్రకారం, తల్లి ఆస్తిలో కుమార్తె మరియు అల్లుడికి ఆస్తి హక్కుపై చర్చ జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీ కోర్టులో మహిళల హక్కులకు సంబంధించిన కీలక నిర్ణయం వెలువడింది. కేసు ఆధారంగా, భర్త మరణించిన తర్వాత, భార్య పేరు మీద భర్త కొనుగోలు చేసిన ఆస్తిపై భార్యకు హక్కు ఉందని, దానిని ఆమె ఇష్టానుసారం ఉపయోగించుకోవచ్చని కోర్టు పేర్కొంది. అలాగే అతని కూతురు, అల్లుడు కూడా ఈ ఆస్తికి అర్హులు కాదు. ఢిల్లీలోని శాస్త్రి నగర్‌లో నివసిస్తున్న 85 ఏళ్ల వృద్ధురాలికి అనుకూలంగా కోర్టు ఈ నిర్ణయం (హైకోర్టు



తీర్పు) జారీ చేసింది. మహిళ కుమార్తె మరియు అల్లుడు ఇంటిలో కొంత భాగాన్ని ఖాళీ చేయడానికి నిరాకరించారు, ఆ తర్వాత వారు ఆస్తిపై వృద్ధురాలి దావాను సవాలు చేశారు (హైకోర్టులో ఆస్తి కేసు). కేసు ప్రకారం, లజ్వంతి దేవి తన కుమార్తె మరియు అల్లుడు 1985లో తనకు ఇచ్చిన ఆస్తిలో కొంత భాగాన్ని వారి వ్యక్తిగత అవసరాల కోసం తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేసింది. కానీ ఇద్దరూ దాన్ని ఖాళీ చేసేందుకు సున్నితంగా నిరాకరించారు. మహిళను ఇంటి యజమానిగా అంగీకరించిన అదనపు సెషన్స్ జడ్జి కామినీ లావ్, ఆ మహిళ భర్త 1966లో తన భార్య పేరు మీద ఆస్తిని కొనుగోలు చేశారని, తద్వారా ఆమె మరణించిన తర్వాత ఆమె సురక్షితమైన జీవితాన్ని గడపవచ్చని అభిప్రాయపడ్డారు (ప్రాపర్టీ లా ఇండియా) .

మహిళ ఈ విషయంపై స్పందిస్తూ.. కూతురు, అల్లుడు ఇంటిని కోర్టు ఖాళీ చేయాలి. కుమార్తె, అల్లుడు వారి అనుమతి తీసుకున్న తర్వాతే ఇంట్లో నివసించే హక్కు ఉంటుందని, మహిళ హక్కులకు భంగం కలిగించరాదని కోర్టు పేర్కొంది. 6 నెలల్లోపు ఇల్లు ఖాళీ చేసి ఆ మహిళకు జరిగిన నష్టాన్ని చెల్లించాలని దంపతులను ఆదేశించగా, హిందూ వితంతువు లజ్వంతి దేవి తన భర్త తన పేరుతో కొనుగోలు చేసిన ఆస్తిపై ఆమెకు హక్కు ఉందని కోర్టు పేర్కొంది. అంతే కాదు 2014లో విచారణ ప్రారంభమైనప్పటి నుంచి ఆ వృద్ధురాలికి ఆమె కూతురు, అల్లుడికి నెలకు రూ.10 వేలు ఇచ్చేవారు. ఇవ్వనున్నట్లు కోర్టు తన తీర్పులో ప్రకటించింది. ఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు నెలకు రూ.10,000 ఇవ్వాలని ఆదేశించింది.



# రూ.5 కోట్లు ఇవ్వాలి లేదంటే.. సల్మాన్‌ను చంపేస్తాం

గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బాలీవుడ్ స్టార్ నటుడు సల్మాన్ ఖాన్‌కు తాజాగా మరోసారి బెదిరింపులు వచ్చాయి. కృష్ణ జింకను చంపినందుకు గానూ సల్మాన్ ఆలయాన్ని సందర్శించి క్షమాపణలు చెప్పాలని.. లేదంటే రూ.5 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడిగా చెప్పుకునే వ్యక్తి నుంచి ముంబై పోలీస్ ట్రాఫిక్ కంట్రోల్ యూనిట్‌కు సోమవారం ఈ సందేశం వచ్చినట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు. 'సల్మాన్ ఖాన్ బతికి ఉండాలంటే గుడికి వెళ్లి క్షమాపణ చెప్పాలి. లేదా రూ. 5 కోట్లు చెల్లించాలి. అలా చేయకపోతే మేము అతన్ని చంపేస్తాం. మా గ్యాంగ్ యాక్టివ్‌గా ఉంది' అని బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపు మెసేజ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. కాగా, సల్మాన్ ఖాన్‌కు ఇటీవలే వరుస హత్య బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. ప్రాణాలతో ఉండాలన్నా, బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు అక్టోబర్ 17 రాత్రి మెసేజ్ చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ నంబర్ ఎవరిది, మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చిందని కనుక్కొనే పనిలో పడ్డారు. ఈ కేసులో జంషెడ్‌పూర్‌కు 24 ఏళ్ల కూరగాయల అమ్మకందారుడు షేక్ హుస్సేన్ షేక్ మౌసిన్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గత శుక్రవారం కూడా సల్మాన్‌కు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. బెదిరింపులకు పాల్పడింది నోయిడాకు చెందిన 20 ఏళ్ల వ్యక్తి మహ్మద్ తయ్యబ్‌గా గుర్తించిన పోలీసులు అతడి అరెస్ట్ చేశారు. ఆ తర్వాత గత నెల 30వ తేదీన కూడా మరోసారి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. రూ. రెండు కోట్లు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని ఆయన్ను బెదిరించారు. గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఆ మెసేజ్ వచ్చింది. ముంబై ట్రాఫిక్ పోలీసులకు ఆ మెసేజ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఒకవేళ డబ్బులు చెల్లించకుంటే, అతన్ని చంపేస్తామని ఆ మెసేజ్‌లో వార్నింగ్ ఇచ్చారు. ముంబైలోని వర్లీ పోలీసులు.. గుర్తు తెలియని వ్యక్తిపై కేసు బుక్ చేసి విచారణ చేపట్టారు. వరుస బెదిరింపుల నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం సల్మాన్‌కు భద్రతను పెంచింది.

# మతిపోగొడుతోన్న నభా నటేష్

నన్ను దోచుకుందువటే సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది నభా నటేష్. తొలి సినిమాతోనే నటనతో మంచి మార్కులు కొట్టేసింది. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసింది కానీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. ఇక ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. కానీ సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేసింది. టాలీవుడ్ ప్రేక్షకుల మనసులో ఇస్మార్ట్ పోరిగానే గుర్తుండి పోయింది. చేసినవి కొన్ని సినిమాలైనా.. తనదైన గ్లామర్ షోతో పాటు నటనతో యూత్‌కు ఆరాధ్య కథానాయికగా మారింది. తెలుగులో మేస్ట్రో తర్వాత ఈ భామ చేతిలో ఒక్క మూవీ లేకుండా పోయింది. తాజాగా స్వయంభూ మూవీతో తన సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసింది ఇస్మార్ట్ పోరి.



# మరో జగన్ దెబ్బ

జగన్‌ను ఎన్నికల్లో ప్రజలు వదిలించుకున్నారు. కానీ, ఐదేళ్ల పాలనా పాపాల బాదుడును మాత్రం ఇప్పటికీ వదిలించుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వ శాపాలు ఇంకా విద్యుత్తు చార్జీల రూపంలో ప్రజలను పట్టి పీడిస్తూనే ఉన్నాయి. 2022-23 ఇంధన సర్దుబాటు భారం రూ.8,114 కోట్లకుగాను రూ.6,072 కోట్లకు రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి ఆమోదించింది. ఈ భారం ఈ నెల నుంచే ట్రూఅప్ కింద జనం భరించడం మొదలైంది. ఇది చాలదన్నట్టు.. వైసీపీ పాలన నాటి మరో పీడ కత్తిలా వేలాడుతోంది. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే, 2023-24 సంవత్సరానికిగాను డిస్కమ్‌లు రూ.11,826.47 కోట్ల ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలు చేశాయి. వీటిపై శుక్రవారం ఈఆర్‌సీ స్పందించింది. ఈ ప్రతిపాదనలపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 19 లోగా లిఖిత పూర్వకంగాను, మెయిల్ ద్వారాను స్పందించాలని ఈఆర్‌సీతో పాటు డిస్కమ్‌లు కోరాయి. అయితే, ఈఆర్‌సీ తీరుపై వినియోగదారుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే దాదాపు రూ.6,072 కోట్లు,రూ.11,826.47 కోట్లు..మొత్తం రూ.17898.47 కోట్ల ట్రూఅప్ భారంపై నిర్ణయాన్ని తీసుకునేందుకు ఈఆర్‌సీ సిద్ధం కావడంపై ప్రజా సంఘాలు నిరసనలకు సిద్ధమవుతున్నాయి. విద్యుత్తు పంపిణీ సంస్థలకు విద్యుత్తు ఉత్పత్తి వ్యయాలు .. కొనుగోలు చార్జీలు భారంగా మారకూడదని .. ట్రూఅప్, ట్రూడౌన్ చార్జీల విధానాన్ని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ) తీసుకువచ్చింది. డిస్కమ్‌లు ప్రతిపాదించే ట్రూఅప్ లేదా ట్రూడౌన్ చార్జీల ప్రతిపాదనలను పెండింగ్‌లో పెట్టొద్దని రాష్ట్రాల విద్యుత్తు నియంత్రణ మండలి (ఎస్‌ఈఆర్‌సీ) లకు స్పష్టంగానే పేర్కొంది. దానివల్ల వినియోగదారులపై మోయలేని భారం పడుతుందని హెచ్చరించింది. ఇలాం టి ప్రతిపాదనలపై 90 రోజుల్లోగా ఆదేశాలివ్వాలని



మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే.. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం .. విద్యుత్ రంగాన్ని దెబ్బతీసే నిర్ణయాలెన్నో తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలోని విద్యుత్తు కొనుగోళ్లపైనా సమీక్షించింది. 2014-15లోనూ .. 2015-16లోనూ విద్యుత్తు కొనుగోలు భారం పెద్దగా లేకపోవడంతో .. ట్రూఅప్ ప్రతిపాదనలను ఏపీఈఆర్‌సీకి డిస్కమ్‌లు పంపలేదు. 2016-17లో రూ.3,058 కోట్లకు ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలు పంపితే ఈఆర్‌సీ కేవలం రూ225 కోట్లకు ఆమోదించింది. 2017-18కు రూ434 కోట్లకు ప్రతిపాదనలు పంపితే, రూ.599 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదించింది. 2018-19కి రూ.1,538 కోట్లకు ట్రూఅప్ ప్రతిపాదనలు పంపితే.. రూ.9,40 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదించింది. 2019-20లో రూ.461.92 కోట్లకు ప్రతిపాదనలు పంపితే ..204.82 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదించింది. 2019 మే నెలలో జగన్ నేతృత్వంలో వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చింది. అప్పటికి గడచిన ఐదేళ్లలో చేపట్టిన విద్యుత్ సంస్కరణ ప్రభావం కారణంగా .. ట్రూఅప్ భారం అంతంత మాత్రంగానే ఉంది. జగన్ వచ్చిన తొలి ఏడాదిలో 2020-21కుగాను రూ.1,685 కోట్ల ట్రూడౌన్‌ను డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. అప్పటినుంచి వరుసగా 2021-22లో రూ.980 కోట్లు, 2022-23లో 8,114 కోట్లు, 2023-24లో 11,826 కోట్లు ప్రతిపాదించాయి. జగన్ అధికారంలోకి వచ్చాక విచ్చలవిడితనం పెరిగిపోయిందనేందుకు ఇదే నిదర్శనమని విద్యుత్తురంగ నిపుణులు చెబుతున్నారు. 2021-22 దాకా డిస్కమ్‌లు చేసిన ప్రతిపాదనలపై సకాలంలో నిర్ణయాలను తీసుకున్న రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి...2022-23 నుంచి ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట విధించే ట్రూఅప్‌లపై నిర్ణయం తీసుకోకుండా పక్కన పడేసింది. 2022-23 ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలను సీఎంగా జగన్ ఆదేశాల మేరకు 2022 సెప్టెంబరులోనే డిస్కమ్‌లు సమర్పించినా .. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యేంతవరకూ నిర్ణయం తీసుకోలేదు. అదేవిధంగా 2023-24 సంవత్సరానికి రూ.11,826.42 కోట్లకు సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందే ఈఆర్‌సీకి డిస్కమ్‌లు సర్దుబాటు ప్రతిపాదనలను సమర్పించాయి. 2022-23 ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలపై నిర్ణయాన్ని ప్రకటించకుండానే .. విద్యుత్తు టాలీఫ్‌ను ఈఆర్‌సీ జారీ చేసింది. గత నెల 29వ తేదీన ఈఆర్‌సీ చైర్మన్‌గా పదవీ విరమణ చేసే ముందురోజున .. అంటే .. అక్టోబరు 28వ తేదీన ఈఆర్‌సీ 2022-23 సర్దుబాటు ప్రతిపాదనలు రూ.8,114 కోట్లకు గాను రూ.6,072 కోట్లకు ఆమోదిస్తూ ఆదేశాలు ఇచ్చింది. 2023-24కు ప్రతిపాదించిన రూ.11,826.42 కోట్లకు మాత్రం నిర్ణయం తీసుకోలేదు.



# కాంగ్రెస్ పాలనలో.. పిచ్చోడి చేతిలో రాయిలా మారిన తెలంగాణ

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తొమ్మిదిన్నరేండ్లు రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం రయ్ రయ్‌మని ఉరికిందని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిలోనే నై.. నై.. అంటున్నదని చెప్పారు. కేసీఆర్ పాలనలో రియల్ భూమ్ ఎలా ఉండేదని, కాంగ్రెస్ పాలనలో ఎందుకు ఆగిపోయిందని ప్రశ్నించారు. కేవలం పరిపాలన దక్షత లోపం, విజన్ లేని పాలనా విధానంతోనే ఆదాయం పడిపోయిందని చెప్పారు. హైడ్రాతో తెలంగాణ ఆదాయానికి జీవధార అయిన రియల్ రంగంపై వేటు పడిందని, ముందు చూపులేని నిర్ణయాలతో రాష్ట్ర ఆదాయానికి పోటు పడిందన్నారు.

'పిచ్చోడి చేతిలో రాయిలా మారిన తెలంగాణ
తొమ్మిదిన్నరేళ్లు రియల్ ఎస్టేట్ రంగం రయ్.. రయ్ మని ఉరికింది..
కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిలోనే నై.. నై అంటోంది..
కేసీఆర్ పాలనలో రియల్ భూమ్ కొనసాగింది ఎట్ల.. కాంగ్రెస్ పాలనలో ఆగిపోవడం ఎట్ల?
కేవలం పరిపాలన దక్షత లోపం..విజన్ లేని పాలనా విధానం!!
తెలంగాణ ఆదాయానికి జీవధార రియల్ రంగంపై హైడ్రా వేటు
ముందు చూపు లేని నిర్ణయాలతో రాష్ట్ర ఆదాయానికి పోటు' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.